
# చిదంబరానంద

"అమృతపాణి"



స్వామి చిదంబరానంద!

ఆ ముఖంలో ఏమి వర్చస్సు!

ఆ కళ్ళలో ఏమి తేజస్సు!

దబ్బపండులాంటి శరీర ఛ్ఛాయ!

సరైన వొడ్డూ పొడుగూ వుండడం ఒకెత్తు అయితే – చక్కని ముఖ కవళికలూ గంభీరమైన కంఠస్వరం కలిగివుండడం మరొకెత్తని చెప్పాలి! అందుకే వారి ప్రతి మాటా, ప్రతి కదలికా, భక్త జనుల్ని ఆనందసాగరంలో ముంచెత్తుతూంటాయి.

ఆ కళ్ళజోడూ, పొడుగాటి గెడ్డం స్వామికి ఎంతగానో నప్పాయి!

అనర్గళంగా సాగిపోయే వారి వేదాంతోపన్యాసాలని విని తీరాలి!

మొట్టమొదటిసారిగా వారి ఉపన్యాసం విన్నప్పుడు పరమహంస ముగ్ధుడయిపోయాడు! వారి ఉపన్యాసాలన్నీ విన్నాక తను వారికి శిష్యుడుగా సుశ్రూష చెయ్యడం వినా – తన జీవితానికి మరో ధ్యేయం లేదనుకున్నాడు. ఆఖరి రోజు – స్వామివారి కాళ్ళ మీద పడిపోయి తనను శిష్యుడిగా స్వీకరిస్తే తప్పిస్తే కాళ్ళని విడిచిపెట్టేది లేదని అన్నాడు. స్వామి ముఖం అతి ప్రశాంతంగా వుంటుంది. అయినా వారి కళ్ళలో చిన్న పిసరు కంగారు కనిపించింది! తన కోరికని మన్నించేంతవరకూ పరమహంస స్వామివారి కాళ్ళని వొదిలిపెట్టలేదు!

తను తీసుకున్న నిర్ణయం సరైనదేననిపిస్తోంది. తన భక్తి తత్పరతతోనూ సేవలతోనూ స్వామిని రంజింపచేశాడు. కొద్దికాలంలోనే అనుంగు శిష్యుడయిపోయాడు.

స్వామి వేదాంతం మీద ఉపన్యాసాలు ఇస్తారని చెప్పి ఇహాన్ని గురించి పట్టించుకోరనటానికి వీల్లేదు! ఏ ఊరు వెళ్ళినా తనకీ, తన శిష్య పరంపరకీ, సదుపాయాలన్నీ సక్రమంగా అమరుతున్నాయో లేదో చూసుకొంటారు. ఒకమారు స్వామి ఉపన్యాసం ముగించుకొని గెస్టు హవుస్‌కి తిరిగొచ్చేశారు. ఒక మామిడిపళ్ళ వర్తకుడు వచ్చాడు. ముఖంలో స్వామివారి పట్ల భక్తి భావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కానీ ఆ చూపుల్లో ఏదో ఆందోళన! మాట సరేసరి! చాలా కంగారుగా వుంది! ఇన్‌కంటాక్స్ గొడవల్లో ఇరుక్కొన్నాట్ట. బయటపడే మార్గం సెలవియ్యమన్నాడు.

స్వామి అతనికి ధైర్యం చెప్పి – స్థిమితపడేటట్టు చేశారు. గాలిలో చేయి తిప్పారు. చేతిలోకి అరటిపండు ప్రత్యక్షమయింది! ప్రసాదాన్ని తినమన్నారు. వర్తకుడు అప్పటికప్పుడే అరటి పండు వొలుచుకొని తిన్నాడు. వెళ్తున్నప్పుడు ఎంతో సంతోషంగా వెళ్ళాడు! మరో రెండు రోజుల తర్వాత మళ్ళీ వచ్చాడు. స్వామివారి కాళ్ళమీద పడ్డాడు. వారి పాద ధూళి తన నెత్తిన జల్లుకున్నాడు. ఇన్‌కంటాక్స్ గొడవల్లోంచి బయటపడ్డాట్ట!

"సర్వసంగపరిత్యాగులు! మీకేమిస్తే మటుకు అంగీకరిస్తారు?!" అన్నాడతను.

స్వామి ఉపనిషత్తులోంచి శ్లోకం ఒకటి కోట్ చేశారు. దాని సారం ఏమిటంటే – భక్తజనుల్ని సంతృప్తిపరచటం కోసం – వారిచ్చే కానుకల్ని అంగీకరించటం తనవంటి సర్వసంగపరిత్యాగులకి ముఖ్యమైన విధి – అని!

అంతే! ఆ సాయంత్రమే ఘుమఘుమలాడే రసాలూ, పంచదార కలిసెలూ, బంగినపల్లిలూ, పెద్ద పెద్ద బుట్టల్లో వచ్చాయి!

మరోమారు కాఫీ హోటల్ ప్రొప్రయిటర్ వచ్చాడు. మనిషన్నాక సమస్యలు లేకుండా ఉంటాయా? ముఖం చేతులూ కదులుతూనే ఉన్నాయి! నెర్వస్ వీక్‌నెస్‌ట. ఎన్ని వైద్యాలు చేయించినా నయం కాలేదుట. స్వామివారిని శరణుజొచ్చాడు.

స్వామి గాలిలో చెయ్యి తిప్పారు. విభూతి వచ్చింది. అతనికిచ్చారు. నుదుట్న పెట్టుకోమన్నారు. చేతులకి రాసుకోమన్నారు. అంతే! చెయ్యి వణకడం ఆగిపోయింది! ముఖం కూడా స్టెడీగా వుంది! స్వామివారి విభూతికి ఎంతటి మహత్తు!!

అతను పరమానందభరితుడయిపోయాడు! స్వామివారికి తనేమి ఇచ్చినా వొప్పుకోరు కదా –

అన్నాడు. స్వామి వెంటనే భగవద్గీతలోంచి ఒక శ్లోకాన్ని వినిపించారు. ఆ శ్లోకం ప్రకారంగా తను అతనిచ్చే కానుకలేమైనాసరే – అంగీకరిస్తానన్నారు. మాటవరసకి హోటల్ నుంచి రోజూ తనకీ తన శిష్యులకీ తినుబండారాలు పంపిస్తే తాము అంగీకరిస్తామన్నారు. ఆ విధంగా చెయ్యడం శ్రీకృష్ణుడు కుచేలుడి దగ్గరనుంచి అటుకులు అంగీకరించడం లాంటిదన్నారు. అంతే! ఆ మరునాటి నుంచి నోరూరించే తినుబండారాలు రావటం మొదలయ్యాయి.

స్వామి ఒకటే చెప్పారు. తను వేదాంతం మీద ఉపన్యాసాలివ్వొచ్చు. తను సన్యాసీ కావచ్చు. కానీ భక్తుల్ని సంతృప్తిపరిచేటందుకు వారిచ్చే కానుకల్ని అంగీకరిస్తారు

రకరకాల మనుషులు రకరకాల సమస్యలతో స్వామివారి దగ్గరకి వచ్చేవారు. స్వామి –వారికి విభూతి ఇవ్వటం – అది నొసట్ని పెట్టుకుని నోట్లో కొద్దిగా వేసుకుంటే – సమస్యలు ఇట్టే మంచులా కరిగిపోవటం! భక్తులు స్వామి వారికి రకరకాల కానుకల్ని సమర్పించటం ద్వారా తమ కృతజ్ఞతనీ, భక్తినీ, తెలియజేసుకొనేవారు. గెస్ట్ హవుస్ అంతా పళ్ళూ, ఫలహారాలూ, బట్టలూ, బెల్లపు అచ్చులూ, ఇంకా ఖరీదయిన వస్తువులతోనూ నిండిపోయి వుండేది. స్వామి వాటిని తిరిగి భక్తులకే

# చిదంబరానంద

ఇచ్చేస్తుండేవారు. ఆయనకేం కావాలని? ఏ పూర్టో వచ్చిన కానుకల్ని ఆ పూర్టోనే భక్త'జనాలకి పంచి పెట్టేసేవారు.

పరమహంస ´కూడా ఒకమారు విపరీతమయిన కడుపునెప్పి వస్తే – స్వామివారి విభూతి కొద్దిగా నోట్లో వేసుకొని మింగాడు. అంతే!! కడుపు నొప్పి మరుక్షణంలోనే నయమయింది!! మరోమారు జ్వరం తగిలినట్టనిపించి స్వామివారి విభూతి సేవించాడు. అంతే! మళ్ళీ జ్వరం తగిలితే ఒట్టు!! అందుకే స్వాములవారు కారణజన్ములని నమ్ముతాడు.

స్వామి ఉపన్యాసం ఇస్తున్నంతసేపూ వొణికి నట్టనిపించింది!! ఆ తర్వాత తనూ, స్వామి గెస్ట్ హవుస్‌కి వచ్చేశారు.

స్వామి వస్తూనే పక్కమీద వాలిపోయేరు. చలితో విపరీతంగా వొణికిపోతున్నారు!

తను స్వామి చేతిని పట్టుకొన్నాడు. వేడిగా కాలిపోతోంది.

స్వామికి జ్వరమా?!–

వారికి మానవాతీత శక్తులుండవచ్చు. కానీ వారూ మానవమాత్రులే కదా–

'పరమహంసా – తల పగిలిపోతోందోయ్–'

తనకి బలే బాధనిపించింది.

"పరమహంసా – వొళ్ళు కాలిపోతోందోయ్–'

తనకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏమిటి ఇంకా చూస్తూ కూర్చున్నావ్?!" స్వామివారు హెచ్చరించారు.

"అర్ధమయింది స్వామీ" అని లోపలికి పరుగెత్తాడు.

తీనెమీద దేవుడి విగ్రహం వుంది. విగ్రహం పాదాల దగ్గర స్వామివారు సృష్టించిన విభూతి పళ్ళెంలో వుంది!

తను గబ గబా ఇంత విభూతి తీసుకొని స్వామి దగ్గరకి వెళ్లాడు. స్వామి నుదుట విభూతి పెట్టాడు. నోట్లో కొద్దిగా వెయ్యబోయాడు.

"ఏమిటి నువ్వు చేస్తున్నది?!"

"విభూతి స్వామీ – తమరు సృష్టించినదే –"

"అయితే?!–"

"కొద్దిగా నోట్లో వేసుకోండి స్వామీ–"

"వేసుకొంటే?!"

"జ్వరం నయమవుతుంది స్వామీ –"

స్వామికి ఎందుకోగానీ చాలా కోపం వచ్చింది!!

"మూఢా!! ఆ విభూతి మనకోసం కాదురా – భక్తజనుల కోసం – వెంటనే వెళ్ళి డాక్టర్ని తీసుకురా –" అన్నారు. □


ప్రియ టిల్టింగ్ గ్రైండర్



★ గృహములలో వాడకానికి వీలుగా $1\frac{1}{4}$ మరియు 2 లీటర్ల సైజులలో లభించును.
★ వేగంగా, సున్నితంగా పనిచేస్తుంది.
★ రుబ్బిన పిండిని పూర్తిగా ఆరోగ్యకరమైన పద్ధతి ద్వారా తోడుతుంది.
★ నిర్వహణ వ్యయం స్వల్పం.
★ ఉచిత సర్వీసుతో పాటు రెండు యేండ్లు గ్యారంటీ.

ప్రయోజనాలు

* త్వరగా రుబ్బుతుంది * గ్రైండరును ప్రక్కకు వంపుకొని పిండిని వేరే పాత్రలోకి తోడుకోవచ్చును.
* పొడి దినుసులు కూడా వేసుకొనవచ్చును. * రాయిని పైకెత్తవలసిన అవసరం వుండదు.
* శుభ్రం చేయడం తేలిక * బరువు తక్కువ.

వివరాలకు వ్రాయండి

జ్యోతి మెషినరీ కార్పొరేషన్

7-2-212/213, ఘాసీమండి రోడ్, సికింద్రాబాద్–500 003

ఫోన్ : 821620